క్లుప్తంగా

ధ్యానంతోనే మానసిక ప్రశాంతత

గరుగుబిల్లి: ధ్యానంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని విశ్రాంత ఐఏఎస్ అధికారి జె.మురళి అన్నారు. మండలంలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణంలో టీటీడీ సేవా ట్రస్టు, రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ధ్యానోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత జీవన ప్రయాణంలో మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు ప్రతీ నిత్యం కొంత సమయం ధ్యానం కోసం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో టీటీడీ సేవా ట్రస్టు సభ్యులు డి.పారినాయుడు, శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సారా రహిత మండలమే లక్ష్యం కావాలి

గుమ్మలక్ష్మీపురం: సారా రహిత మండలమే అందరి లక్ష్యం కావాలని కురుపాం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు అన్నారు. నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా సారా రహిత మండలంగా తీర్చిదిద్దేందుకు సహాయమందించాలంటూ బుధవారం గుమ్మలక్ష్మీపురం తహసీల్దార్ కార్యాలయం వద్ద మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులతో ఎక్సైజ్ సీఐ తీర్మానాలు చేయించారు. అలాగే వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.సాల్మన్‌రాజు, తహసీల్దార్ ఎస్.శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో బహుళ ప్రయోజనాలు

పాలకొండ రూరల్: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల బహుళ ప్రయోజనాలు సమకూరుతాయని పాలకొండ సీడీపీఓ బి.సిమ్మాలమ్మ అన్నారు. మండలంలోని నవగాం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లుల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ దశరత్నం మాట్లాడుతూ.. పౌష్టికాహారం వల్ల ప్రయోజనాలను వివరించారు. ముఖ్యంగా రక్తహీనతను అధిగమించడంతో పాటు బిడ్డ ఆరోగ్య పరిస్థితి మెరుగుపడుతుందన్నారు.

జాతీయ మహాసభలను విజయవంతం చేయండి

పాలకొండ: అఖిల భారత కిసాన్ సభ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని రైతు సంఘ జిల్లా నాయకుడు బుడితి అప్పలనాయుడు కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 15,16,17 తేదీల్లో తమిళనాడు రాష్ట్రంలోని నాగపట్నంలో ఈ సభలు జరుగుతాయని చెప్పారు. బీజేపీ తీసుకువచ్చిన రైతు వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా చేపడుతున్న మహాసభలకు ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు కిమిడి రామ్మూర్తినాయుడు, బొత్స గౌరునాయుడు, బచ్చల పారినాయుడు పాల్గొన్నారు.

విద్యార్థినుల ప్రతిభ

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని బీజేపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థినులు జాతీయ ప్రతిభ అన్వేషణ ఉపకార వేతనానికి ఎంపికైనట్టు ఆ పాఠశాల హెచ్‌ఎం వి.రఘురామరాజు బుధవారం తెలిపారు. దొల్లు ఇంద్రాణి, గంటా శ్రీవిద్య కోట కోమలి, చరిష్మ, డంగభద్ర కీర్తన, గంటా యామిని ఎంపికైనట్టు తెలిపారు. పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడు గుంట్రెడ్డి వెంకటనాయుడు ఇచ్చిన శిక్షణతో వీరంతా ఎంపికైనట్టు పేర్కొన్నారు. వీరికి ఏడాదికి రూ.12వేలు చొప్పున నాలుగేళ్లు ఈ ఉపకార వేతనం కేంద్ర ప్రభుత్వం అందివ్వనున్నట్టు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఫీడర్ నిర్వహణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు డీఈఈ టీజీకే మూర్తి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలో ఉన్న ఇందిరానగర్ కాలనీ, వడమ, వడమ కొత్త కాలనీ గారమ్మ కాలనీ, మున్సిపల్ కార్యాలయం పరిధిలోని ఏరియా, రాజాం రోడ్డులోని గజాల ఖానా నుంచి తుమరాడ వరకు, గోపాలపురం, మంగళాపురం, తంపటాపల్లి, బుక్కూరు, రాజుపేట, అర్దలి, బాసూరు, ఎల్ఎల్‌పురం, కోటిపల్లి, పద్మాపురం ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వెంకటరాజపురాన్ని వీడని ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని గవరమ్మపేట పంచాయతీ వెంకటరాజపురం పంట పొలాల్లో ఏనుగులు బుధవారం ఉదయం దర్శనమిచ్చాయి. పక్షం రోజుల నుంచి పరిసర గ్రామాలలోని పంట పొలాలలో తిరుగుతూ రాత్రి సమయాన గ్రామంలోకి చొచ్చుకు వస్తున్నాయని గ్రామస్తులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామాన్ని ఆనుకొని అరటి, పామాయిల్ తోటలతో పాటు వరి పంట ఉండడంతో గ్రామాన్ని వీడడం లేదు. పుష్కలంగా పంటలు, తాగునీరు ఉండడం వల్లే గ్రామాన్ని విడిచిపెట్టడం లేదని రైతులు వాపోతున్నారు. చేతికందుతున్న పంట ధ్వంసం కావడంతో ఏమి చేయాలో తోచడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దూర ప్రయాణాలకు వెళ్లి రాత్రి సమయాన రావడం కష్టంగా ఉందని రైతులు చెబుతున్నారు.

అధ్వాన రహదారి..



వీరఘట్టం మండల కేంద్రంలోని స్వామి థియేటర్ నుంచి ఆర్‌అండ్‌బీ బంగ్లాకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. పెద్ద పెద్ద గోతులేర్పడడంతో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. ఈ రోడ్డు మీదుగా బీసీ కాలనీ, గాయత్రీనగర్ కాలనీకి చెందిన వారు ఎక్కువగా రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – వీరఘట్టం

మహిళల కోలాటం



భామిని మండలంలోని వడ్డంగి గ్రామంలో నిర్వహిస్తున్న శ్రీరామ నవమి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ప్రదర్శించిన మహిళల కోలాటం అలరించింది. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో కొలువైన అభయ కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో వైఎస్సార్‌సీపీ నాయకుడు బోదెపు రఘుపతినాయుడు, తదితరులు పాల్గొన్నారు. – భామిని


పరామర్శ



సీతంపేట మండలం కిల్లాడ గ్రామానికి చెందిన వలస కార్మికుడు వూయక రాహుల్ ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బుధవారం పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు ఓదార్చారు. కార్యక్రమంలో సర్పంచ్ తిరుపతిరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కేశవరావు, షోడంగ పాల్గొన్నారు. – సీతంపేట

ఇది మరీ విడ్డూరం..

- పైనుంచి పెచ్చులూడుతుంటే కిందన టైల్స్ వేస్తున్నారు
- గాలేస్తే పడిపోయే భవనాలకు టైల్స్
- ఎవరి కోసం ఈ పనులు
- ముక్కున వేలేసుకుంటున్న ప్రజలు



బీటలు వారి ప్రమాదకరంగా మారిన పాత భవనం గోడ

వీరఘట్టం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌ను 1950లో ప్రారంభించారు.. అప్పుడు నిర్మించిన భవనాలకు దాదాపు 75 సంవత్సరాలు పూర్తయ్యాయి.. ప్రస్తుతం ఆ భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో అప్పుడప్పుడు పెచ్చులూడుతూ కింద పడుతున్నాయి. దీంతో ఈ గదుల్లో ఉండాలంటేనే విద్యార్థులు, ఉపాధ్యాయులు భయపడుతున్నారు. వీటిని తొలగించాలని చాలాసార్లు విద్యాశాఖ ఉన్నతాధికారులకు తెలియజేశారు. అయినా ఎవ్వరూ స్పందించలేదు. పైగా పాఠశాల అభివృద్ధికి మంజూరైన రూ.60 లక్షల నిధులతో ప్రస్తుతం టైల్స్ వేస్తున్నారు.గాలేస్తే పైనుంచి పెచ్చులూడుతున్న భవనాలకు టైల్స్ వేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ఇదీ పరిస్థితి..

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి వరకు 265 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి తరగతులు నిర్వహించేందుకు 15 వరకు గదులున్నాయి. ఈ 15 గదులను తరగతుల నిర్వహణతో పాటు ఇతర అవసరాలకు వినియోగించుకుంటున్నారు. అయితే పాఠశాల అభివృద్ధికి రూ. 60 లక్షల నిధులు మంజూరు కావడంతో అధికారులు గదుల అభివృద్ధికి ఉపక్రమించారు. ఎవరైనా తొలుత పైకప్పు నుంచి గోడలన్నీ బాగుచేసి ఆఖరులో గచ్చులు లేదా టైల్స్ వేస్తారు. ఇక్కడ అందుకు విరుద్ధంగా పనులు చేపడుతున్నారు. పైభాగంలో చేపట్టాల్సిన పనులను వదిలేసి ముందు టైల్స్ వేస్తుండడం విమర్శలకు తావిస్తోంది. ఈ పనుల వల్ల ఏం ఉపయోగం ఉంటుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. 75 ఏళ్ల కిందటి గదులు కావడంతో ఎప్పుడు ఏ గోడ నుంచి ఏ పెచ్చు ఊడుతుందోనని భయమేస్తోందని ఉపాధ్యాయులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి ఈ భవనాలను ఒక్కసారి పరిశీలించిన తర్వాత నిర్ణయం తీసుకోవాలని అటు ప్రజలు ఇటు ఉపాధ్యాయులు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న వీరఘట్టం హైస్కూల్ పాత భవనం

ఉన్నతాధికారులకు తెలియజేశాం..

పాత భవనాలకు మరమ్మతులు చేపడుతున్న విషయం ఉన్నతాధికారులకు తెలియజేశాం. గాలేసిన ప్రతిసారీ పెచ్చులూడుతున్నాయి. అందుకే పాత భవనాలను పక్కనబెట్టి కొత్తగా నిర్మించిన భవనాలు తరగతులు నిర్వహిస్తున్నాం. పాత భవనాలను తొలగిస్తే మంచిది.

– బి.సొంబర, హెచ్‌ఎం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వీరఘట్టం



శిథిల భవనంలో కొత్తగా వేసిన టైల్స్

ఉద్యోగ భద్రత కల్పించాలి



ఎంపీడీఓ కృష్ణారావుకు వినతిపత్రం అందజేస్తున్న క్షేత్ర సహాయకులు

సీతంపేట: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న క్షేత్ర సహాయకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని పలువురు కోరారు. ఈ మేరకు ఎంపీడీఓ టి.కృష్ణారావును బుధవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 19 ఏళ్లుగా సేవలందిస్తున్నామన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వడంతో పాటు పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అర్హత కలిగిన వారికి ఉద్యోగోన్నతి కల్పించాలని, మండల స్థాయిలోనే బదిలీలు చేపట్టాలని కోరారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన..



పాలకొండలోని ఉషా మల్టీ స్పెషాలిటీ డెంటల్ క్లినిక్‌లో అగ్ని ప్రమాదాలు – నివారణ చర్యలపై బుధవారం అవగాహన కల్పించారు. స్థానిక ఫైర్ ఆఫీసర్ జామి సర్వేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలతో పాటు ప్రమాదాలు జరిగినప్పుడు నష్ట నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రయోగపూర్వకంగా వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ పి.కల్యాణ్ చక్రవర్తి, డాక్టర్ వి.స్నేహజ్యోతి, డాక్టర్ కె. సుష్మా, ఆస్పత్రి సిబ్బంది, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు. – పాలకొండ రూరల్


అంగన్‌వాడీ వర్కర్ల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

గరుగుబిల్లి: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని కొమరాడ ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి జి.సుగుణకుమారి అన్నారు. జాతీయ పౌష్టికాహార పక్షోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో అంగన్‌వాడీ వర్కర్లతో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు తీసుకొనే ఆహారంలో పోషక విలువలతో కూడిన సహజ సిద్ధమైన ఆకుకూరలు, కూరగాయలు వంటి వాటిని తీసుకోవాలన్నారు. నాగూరు, రావివలస గ్రామాల్లో కూడా ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్లు ఆర్.లక్ష్మి, అరుణకుమారి, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వేతనం అమలు చేయాలి



ఎంపీడీఓ పైడితల్లికి వినతిపత్రాన్ని అందజేస్తున్న క్షేత్ర సహాయకులు

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకంలో తమకు కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ ఎంపీడీఓ జి.పైడితల్లికి క్షేత్ర సహాయకులు బుధవారం వినతిపత్రాన్ని అందించారు. క్షేత్ర సహాయకులకు నెలకు రూ.26 వేలు వేతనం అమలు చేయాలని కోరారు. ఎన్ఎంఎంఎస్ యాప్‌లో ఎదురవుతున్న సమస్యల కారణంగా వేతనదారుల హాజరు అప్‌లోడ్ కావడం లేదన్నారు. క్షేత్ర సహాయకుల సంఘ నాయకులు ఎస్.సూర్యనారాయణ, ఆదినారాయణ, రామ్ ప్రసాద్, వై.పోలినాయుడు తదితరులున్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కొమరాడ: జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న క్షేత్ర సహాయకులకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం అమలు చేయాలని సీఐటీయూ నాయకుడు కొల్లి సాంబమూర్తి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎం.మల్లికార్జునరావుకు క్షేత్ర సహాయకులతో కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు దశాబ్దాలుగా చాలీచాలని జీతాలతో బతుకు జీవనం నడిపిస్తున్నారన్నారు.

కూటమి పాలనలో అందని వైద్యం

- మాజీ ఎమ్మెల్యే కళావతి

పాలకొండ: కూటమి ప్రభుత్వం పాలనలో పేదలకు వైద్యం అందని పరిస్థితి నెలకొందని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి ఆరోపించారు. మండల కేంద్రంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ సేవలకు సంబంధించిన బిల్లులు చెల్లించకపోవడంతో కార్పొరేట్ ఆస్పత్రులు రోగులకు వైద్యం అందించడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి వైద్యరంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ముందుగా వైద్య కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడం, ఆరోగ్య సేవలపై నిర్లిప్తత, ప్రభుత్వ ఆస్పత్రుల్లో మౌలిక వసతులు లేకుండా చేయడం, తదితర చర్యలతో వైద్యరంగం కునారిల్లిపోయిందన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో వైద్యం రంగానికి ఎనలేని ప్రాధాన్యం కల్పించామన్నారు. రాజకీయాలకతీతంగా సీఎం రిలీఫ్‌ఫండ్ అందించామని గుర్తు చేశారు.

అక్రమ కట్టడాలపై హెచ్చరిక బోర్డు ఏర్పాటు



హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేస్తున్న అధికారులు

గుమ్మలక్ష్మీపురం: ఎల్విన్‌పేట గ్రామంలోని సర్వే నంబర్ 60(గ్రామకంఠం), సర్వే నంబర్ 58, 61లకు చెందిన స్థలంలో నేతేటి ఈశ్వరరావు అనే గిరిజనేతర వ్యక్తి చేపడుతున్న కట్టడాలు అక్రమమైనవంటూ రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీస్ శాఖల అధికారులు బుధవారం నిర్మాణం చేపడుతున్న ప్రదేశం వద్ద హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఈ మేరకు గిరిజనేతరుడు ఎల్విన్‌పేట వద్ద(గుణుపూర్ జంక్షన్) ఎటువంటి అనుమతులు లేకుండానే అక్రమ నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ అధికారులు స్పందించడం లేదంటూ పార్వతీపురం మన్యం జిల్లా గిరిజన జేఏసీ మరియు సంఘాలు సంయుక్తంగా పోరాటం చేసి గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో అధికారులు పై చర్యలకు ఉపక్రమించారు. ఆ నిర్మాణాలు అక్రమ కట్టడాలుగా గుర్తించామని నిర్మాణాలు తక్షణమే ఆపాలని హెచ్చరించారు.

ప్రణాళికాపరమైన సాగుతో లాభాలు



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

జియ్యమ్మవలస: వ్యవసాయ సాగులో పక్కా ప్రణాళికతో ముందుకు సాగితే మంచి లాభాలు ఆర్జించవచ్చని పరజపాడు సర్పంచ్ గుంట్రెడ్డి రామకృష్ణంనాయుడు అన్నారు. పరజపాడు గ్రామంలో వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక సర్వేపై బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ విధానాలతో కలిగే ప్రయోజనాల గురించి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. చిరుధాన్యాలు, ఆరుతడి పంటలు, శ్రీ పద్ధతిలో వరి, రాగులు, వాణిజ్య పంటలు వేయడం వలన రైతులు త్వరితగతిన ఆర్థికాభివృద్ధి చెందుతారని ఎస్ఎఫ్ఏ జి.అన్నపూర్ణ తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ సూర్యతేజ, బి.ధనుంజయరావు, త్రినాధ, సింహాచలం, రైతులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు

- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయపార్వతి



గర్భిణితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విజయపార్వతి

భామిని: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కె. విజయపార్వతి ఆదేశించారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణులతో మాట్లాడారు. రోగులకు ప్రతి నెలా అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఎండలు విజృంభిస్తున్న నేపథ్యంలో వడదెబ్బలు చోటుచేసుకోకుండా చర్యలు తీసుకోవడంతో పాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ముమ్మరంగా పంపిణీ చేయాలని వైద్యులు సోయల్, సంతోషిలక్ష్మిలను సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సంపద సృష్టి అంటే ధరలు పెంచడమేనా..?

- మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, పార్టీ నాయకులు

భామిని: ఒక చెయ్యితో సంపద సృష్టించి, రెండో చెయ్యితో పేదలను ధనవంతులను చేస్తానని ప్రగల్భాలు పలికిన చంద్రబాబునాయుడు నిత్యావసరాల ధరలు పెంచి ప్రజలపై భారం మోపుతున్నారని మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి మండిపడ్డారు. మండలంలోని నులకజోడులో వైస్ ఎంపీపీ బోనగడ్డి ధర్మారావు, సాసుపిల్లి విశ్వనాథం, సర్పంచ్ కొత్తూరు ప్రసాద్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడుతూ.. సూపర్ సిక్స్ పథకాల పేర్లు చెప్పి ప్రజలను మభ్యపెట్టి మోసం చేసిన ఘనత కూటమి నాయకులకే చెందుతుందన్నారు. తాజాగా వంట గ్యాస్ సిలిండర్‌పై 50 రూపాయలు పెంచి ప్రజలపై భారం మోపారని చెప్పారు. ఇప్పటికే పెరిగిన పెట్రోల్, డీజిల్, విద్యుత్ ధరలతో ప్రజలు అవస్థలు పడుతున్నారని చెప్పారు. పేదలను లక్షాధికారులను చేస్తానని చెప్పి సంక్షేమపథకాలను బుట్టదాఖలు చేశారని దుయ్యబట్టారు. కొత్త పింఛన్లు ఇవ్వకపోగా.. ఉన్నపింఛన్లలో చాలా మందిని తొలగిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొన్న తిరుమలరావు, సాసుపిల్లి ఫాల్గుణరావు, గెల్లంకి రమేష్, కాగితాపల్లి కృష్ణారావు, వలరౌతు సంజీవరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొండచీపుర్లకు అడ్వాన్స్ టెండర్లు



అడ్వాన్స్ టెండర్లు నిర్వహిస్తున్న పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి

సీతంపేట: కొండచీపుర్ల ముడిసరుకును గిరిజనుల వద్ద నుంచి వ్యాపారులు ఎంతకు కొనుగోలు చేయాలన్న విషయమై బుధవారం స్థానిక ఐటీడీఏలో అడ్వాన్స్ టెండర్లు నిర్వహించారు. ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి, జీసీసీ డీఎం సంధ్యారాణి సమక్షంలో టెండర్లు జరగగా పది మంది వ్యాపారులు పాల్గొన్నారు. కిలో సరుకు ఎంతకు కొనుగోలు చేయాలో ఉద్యోగుల కమిటీతో సర్వే చేయించిన అనంతరం ధర నిర్ణయిస్తామని పీఓ పేర్కొన్నారు. కార్యక్రమంలో జీసీసీ మేనేజర్లు దాసరి కృష్ణ, గొర్లె నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

జనరేట్ కాని విద్యుత్ బిల్లులు



జనరేట్‌కాని ఒక విద్యుత్ బిల్లు



పరిమితికి మించి విద్యుత్ వాడినట్టు వచ్చిన మెసేజ్

వీరఘట్టం: ప్రస్తుత వేసవికాలంలో విద్యుత్ వినియోగం పెరుగుతోంది. అన్ని ఇళ్లల్లో దాదాపుగా ఫ్యాన్లు, ఏసీలు, కూలర్లను వినియోగిస్తుండడంతో గత నెల కంటే ఈ నెల వినియోగం ఎక్కువైంది. ఇలా విద్యుత్ వాడకం పెరిగిన మీటర్లకు బిల్లులు జనరేట్ కాకపోవడంతో వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు. ఇప్పుడు ఈ బిల్లు రాకపోతే వచ్చే నెలకు మొత్తం రెండు నెలలకు సంబంధించి బిల్లు వస్తే యూనిట్ చార్జీలు పెరుగుతాయని ఆందోళన చెందుతున్నారు. ఉదాహరణకు వీరఘట్టంనకు చెందిన 3986 సర్వీస్ నంబర్‌కు ఈనెల 7న రీడర్ బిల్లు పంచ్ చేశాడు. 254 యూనిట్లు విద్యుత్ వాడడంతో అన్ని సర్వీసు చార్జీలతో కలిపి రూ.1789 కట్టాలని రీడర్ మొబైల్‌లో చూపించింది. ఈ రీడింగ్‌ను అప్‌లోడ్ చేస్తే బిల్లు మాత్రం జనరేట్ కావడం లేదు. మీరు పరిమితికి మించి విద్యుత్ వినియోగం చేశారని సమాచారం వస్తోంది. ఈ విషయంపై విద్యుత్ శాఖాధికారుల వద్ద ప్రస్తావించగా.. సాంకేతిక లోపంతో చాలా మందికి ఈ నెల విద్యుత్ బిల్లులు జనరేట్ కావడం లేదని చెప్పారు. ఈ విషయమై వినియోగదారులు ఆందోళన చెందవద్దని, సాంకేతిక సమస్యను పరిష్కరించే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

ఫలించిన వైఎస్సార్‌సీపీ కృషి



కురుపాంలోని సొంత భవనంలో ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల విద్యార్థులు

గుమ్మలక్ష్మీపురం (కురుపాం): వైఎస్సార్‌సీపీ కృషితో కురుపాంలోని శివన్నపేట వద్ద రూ.1200 లక్షలతో నిర్మించిన ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాల సొంత భవనాల్లోకి విద్యార్థులు చేరుకున్నారు. ఈ మేరకు కురుపాంలో ఏకలవ్య పాఠశాల మంజూరైనప్పటికీ.. భవనాలు లేకపోవడం వలన ఆ పాఠశాలను పార్వతీపురంలోని ప్రైవేటు భవనాల్లో ఇప్పటి వరకూ నిర్వహిస్తూ వచ్చారు. ఈ పాఠశాలకు సొంత భవనం నిర్మించేందుకు 2019 డిసెంబర్‌లో అప్పటి గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న పాముల పుష్పశ్రీవాణి శంకుస్థాపన చేశారు. గత ఏడాది మార్చి 15న భవనాల్ని అప్పటి కురుపాం ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి అధ్యక్షతన డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర ప్రారంభించారు. తదనంతరం ఎన్నికల కోడ్ రావడం.. ప్రభుత్వం మారడంతో.. కొంతమేర పనులు పెండింగ్‌లో ఉన్నాయన్న కారణాలతో ఈ నూతన భవనాల్లోకి పార్వతీపురం నుంచి విద్యార్థులను తరలించలేదు. ఈ క్రమంలో మాజీ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి స్పందించి.. కురుపాంలో ప్రారంభించిన ఏకలవ్య పాఠశాల నూతన భవనాల్లోకి విద్యార్థులను తరలించాలంటూ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్‌ను గత ఏడాది సెప్టెంబర్ 25వ తేదీన కలిసి వినతిపత్రం అందజేశారు. ఎట్టకేలకు పార్వతీపురంలో నిర్వహిస్తున్న ఏకలవ్య పాఠశాలను ఏప్రిల్ 2వ తేదీన కురుపాంలోని సొంతగూటికి తీసుకొచ్చారు.